రహదారులకు కొత్త రూపు

- అభివృద్ధి పథంలో 61వ వార్డు
- చకచకా సీసీ రోడ్ల నిర్మాణం
- సమస్యల పరిష్కారంపై స్థానికుల హర్షం


నాడు: ఇండస్ట్రియల్ కాలనీలో అధ్వానంగా సీసీ రోడ్డు




నేడు: ఇండస్ట్రియల్ కాలనీలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గతంలో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న మాదిరిగా పరిస్థితి ఉండేది. టీడీపీ ప్రభుత్వ పాలనలో ఇక్కడి జీవీఎంసీ పాఠశాలలు, సీసీ రోడ్లు, సీసీ కాలువలు, కొండవాలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు ఇలా అన్నీ అసంపూర్తిగా, శిథిలావస్థలో ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. వైఎస్ జగన్ సర్కారు మంజూరు చేస్తున్న నిధులతో నేడు అందరూ మెచ్చుకునే స్థాయిలో ఈ వార్డులో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ వార్డులో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రహదారులను అద్దంలా మెరిసేలా ఆధునికీకరించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కృషితో, వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ చొరవతో 61వ వార్డులోని సమస్యలు పరిష్కారమవుతున్నాయి. వార్డులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నాడు: వెంకన్నపాలెంలో సీసీ రోడ్డు దుస్థితి


నేడు: వెంకన్నపాలెం ఆధునికీకరించిన సీసీ రోడ్డు

నిధులు.. రహదారుల పనులు

- వార్డులోని వెంకన్నపాలెంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.
- ఇండస్ట్రియల్ కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.
- గాంధీజీ వీధిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.
- మల్కాపురం పల్లి వీధిలో రూ.23 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.
- మల్కాపురం నగరాల వీధి మార్కెట్ లైన్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
- బాపూజీ కాలనీలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు.

జోరుగా అభివృద్ధి పనులు



61వ వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి. మా ప్రాంతంలో గతంలో కంటే ఇప్పుడు అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. సీసీ రోడ్లు, వీధి కాలువలు, సామాజిక భవనాల నిర్మాణం వంటి పనులతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తొలగాయి.

– కాకర ప్రకాష్‌రావు, మల్కాపురం

ప్రజలకు అండగా ఉంటున్నాం



నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో 15 నెలలుగా పర్యటిస్తున్నాను. తద్వారా ప్రజలకు అండగా ఉంటున్నాను. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాము. రానున్న రోజుల్లో 61వ వార్డును మరింత అభివృద్ధి చేస్తాం.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

ఎన్నికల హామీలు నెరవేర్చుతున్నాం



జీవీఎంసీ ఎన్నికల ప్రచార సమయంలో వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను ఆడారి ఆనంద్‌కుమార్ సారథ్యంలో ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి చేసి చూపిస్తున్నాం. త్వరలో వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయి.

– కొణతాల సుధ, కార్పొరేటర్, 61వ వార్డు

రహదారులకు మోక్షం లభించింది



మా ప్రాంతంలోని సీసీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నేడు ఇక్కడ కొత్తగా రోడ్డు వేయడంతో ఆ సమస్య తీరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యమిచ్చారు.

– సర్వసిద్ధి పైడిబాబు, గాంధీజీ వీధి

క్లుప్తంగా

శివాలయ ప్రాంగణంలో అన్నసమారాధన


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజు నగర్‌లోని పార్వతీ పరమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి సేవలో తరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్ రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో రైలు కింద పడి సుమారు 55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల తెలిపిన వివరాలు... రైలు ఢీకొట్టడంతో మృత దేహం గుర్తు పట్టలేని విధంగా పడి ఉంది. మృతుడి వద్ద ఆధారాలు దొరకకపోవడంతో గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేశారు. మృతుని శరీరంపై నీలం రంగుల గీతలు గల షర్టు, క్రీమ్ కలర్ ప్యాంటు ఉన్నాయి. వివరాలు తెలిసినవారు రైల్వే పోలీస్ ఎస్‌ఐ కామేశ్వరరావు 9493424987, సీఐ సీహెచ్ ధనుంజయ్ నాయుడు 9440627547 నంబర్లకు తెలియపరచాలని కోరారు.

దళిత వర్గాల అభ్యున్నతికి కృషి


మాటూరి చిన్నారావును సత్కరిస్తున్న నాయకులు

సింధియా: రాష్ట్రంలోని దళిత వర్గ ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని దళితరత్న మాటూరి చిన్నారావు సూచించారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి అంబేడ్కర్‌కాలనీలో దళిత సంక్షేమ సంఘ సభ్యులు ఆదివారం ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగాచిన్నారావు మాట్లాడుతూ బాబూజగ్జీవన్‌రామ్, డాక్టర్ అంబేడ్కర్ లాంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోని దళితులంతా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుడాల బాబూరావు, తంతటి సంపత్, కోటాన రవి, పూండీ మల్లేష్, సిద్దార్థ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడిన ఘటన జరిగింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. పెదగంట్యాడలో నివసిస్తున్న జి.రాజేశ్వరి 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఎంజీ సర్వీస్ కంపెనీలో బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 8న 104 ఏరియా వద్ద సాయంత్రం రోడ్డు దాటుతుండగా కంచరపాలెం నుంచి ఎన్‌ఏడీ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆమెకు గాయాలయ్యాయి. వెంటనే ఆమెను సురక్ష ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రాజేశ్వరి కుమారుడు జి.యశ్వంత్ కుమార్ ఫిర్యాదు మేరకు కంచరపాలెం ట్రాఫిక్ సీఐ నేతృత్వంలో ఎస్‌ఐ ఉల్‌హక్ కేసు దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ బలోపేతానికి కృషి

సింధియా: కేంద్ర పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర సూచించారు. జీవీఎంసీ 63వ వార్డుకు చెందిన సుమారు 50 మంది ఆదివారం బీజేపీలో చేరారు. వార్డు బీజేపీ అధ్యక్షుడు రాజారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గంగయ్య, పశ్చిమ కన్వీనర్ దాడి రమేష్, సేనాపతి మహేష్, ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య భాగ్యం


యోగాలో పాల్గొన్న వారితో నిర్వాహకులు


యోగా సాధనలో కాలనీ వాసులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90 వ వార్డు సీతారామరాజు నగర్‌లోని పతంజలి యోగ కేంద్రం 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన యోగ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. యోగ ప్రాముఖ్యతను చాటిచెప్పేలా ఏర్పాటు చేయడంతో కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేశారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ యోగాతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. సీతారామరాజు నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్‌యార్డు వంతెన వద్ద ప్రమాదం

మల్కాపురం: నేవల్ డాక్‌యార్డ్ వంతెన వద్ద ఆదివారం మధ్యాహ్నం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో ఇరు వాహనదారులకు గాయాలయ్యాయి. మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. నగరం నుంచి సింధియా వైపు బుచ్చిబాబు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి వస్తున్నారు.అదే మార్గంలో సింధియా నుంచి నగరం వైపు సంతోష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. నేవల్ డాక్‌యార్డ్ వంతెన సమీపంలో వీరు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఆ సమయంలో అటు ప్రయాణం సాగిస్తున్న వారు గాయపడిన వారిలో ఆటోలో కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ పరమేశ్వరుల పూజలు


సారెతో మహిళలు


అశోక్‌నగర్ వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ సురేష్, శరగడం పత్నిరావు

మల్కాపురం: గౌరీ పరమేశ్వరుల పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.జీవీఎంసీ 60వ వార్డు అశోక్ నగర్‌లో కొలువు దీరిన గౌరీపరమేశ్వరుల మందిరం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి, గౌరీ సేవా సంఘం ప్రతినిధి శరగడం పత్నిరావులు పాల్గొని పూజలు చేశారు.అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ప్రారంభించారు.

- మల్కాపురం ప్రకాష్‌నగర్‌లోని గౌరీ దేవి ఆలయంలో స్థానిక గౌరీ సేవా సంఘం ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు మహిళలు గౌరీ పరమేశ్వర్లకు వివిధ రకాల పండ్లు, స్వీట్లు సారె సమర్పించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ముగిసిన కేకేఆర్ ట్రోఫీ బాక్సింగ్ పోటీలు


విజేతలతో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సమన్వయకర్తలు ఆడారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు


ఫైనల్స్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు జన్మదినోత్సవంలో భాగంగా ఈ నెల 8న పోర్టు హాస్పిటల్ ఎదురుగా ప్రారంభమైన కేకేఆర్ ట్రోఫీ బాక్సింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు విచ్చేశారు. విశాఖ డిస్ట్రిక్ట్ అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరుసగా మూడో ఏడాది జిల్లా మెన్ అండ్ వుమెన్ సబ్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2023ను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా ఎస్‌టీసీ సాయి నిలువగా, రన్నర్లుగా లక్కీ బాక్సింగ్ క్లబ్ వారు నిలిచారు. విజేతలకు కె.కె.రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేసారు. ముగింపు కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, కె.వి.ఎస్.శశికళ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, పీలా వెంకటలక్ష్మి, ద్రోణంరాజు అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వర్లు, ఏపీ స్టేట్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ బి.లక్ష్మణ్‌దేవ్, ఆర్‌వోసీ సెక్రటరీ బి.నాగేశ్వర్, ఆర్గనైజర్ నీలి రవి, నిర్వాహకుల మామిడి శ్రీను, ఎన్‌టీఆర్ రెడ్డి, బులుసు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయం


మాట్లాడుతున్న వెంగళరావు యాదవ్

మురళీనగర్: బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయంగా రథయాత్ర నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎల్.వెంగళరావు యాదవ్ తెలిపారు. బిర్లా కూడలి కేరళ కళా సమతిలో ఆదివారం నిర్వహించిన బీసీల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. బీసీలకు 90 అసెంబ్లీ స్థానాలు, 13 పార్లమెంట్ స్థానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్ల వుతున్నా బీసీలకు రాజ్యాధికారం రాకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర ఇన్‌చార్జి–మహిళా అధ్యక్షురాలు వై.నూకాలమ్మ, విశాఖ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు కుమారస్వామి, పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి కృషి

సీతమ్మధార: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బి.వి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోని, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సెమినార్ నిర్వహించారు. ముందుగా ఇజ్రాయిల్, పాలిస్తీనా యుద్ధంలో అసువులు బాసిన వారికి సంతాపం తెలిపి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

ప్రజాస్వామ్య పటిష్టతతో హక్కులకు రక్షణ

సీతమ్మధార: ప్రజాస్వామ్యం దిగజారుతున్నప్పుడు హక్కుల ఉల్లంఘన జరగడం సహజమని ఆంధ్ర విశ్వవిద్యాలయం లా విభాగం ప్రొఫెసర్ ఎల్.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫోరం ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘనలు ప్రజాస్వామ్య వ్యవస్థ దిగజారుడుతనం వల్లే జరుగుతున్నాయన్నారు. దేశంలోని పౌరులు తమ హక్కులను తెలుసుకోలేకపోతున్నారన్నారు. ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉంటే హక్కుల ఉల్లంఘన జరగదని పేర్కొన్నారు. విశిష్ట అతిథి ప్రొఫెసర్ ఎల్.వి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఏయే దేశాల్లో ఏరకంగా సంక్షేమానికి పాటుపడుతున్నది గ్రహించాలన్నారు. వ్యవస్థలో కూలంకుశంగా దీనిపై చర్చ జరగాలని సూచించారు. కార్యక్రమంలో ఫోరం ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ అధ్యక్షుడు కుప్పిలి మురళీధర్, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్.వి.సుమన్, సంస్థ కార్యదర్శి బగాది తులసీదాస్, సభ్యులు సునీత, నిర్మల, శ్రీదేవి, ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్‌కు రిమాండ్


నిందితురాలి నుంచి రికవరీ చేసిన బంగారు గొలుసు

గోపాలపట్నం: సింహాచలంలో బాలిక మెడలో బంగారు చైన్‌ను దొంగిలించిన మహిళను గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గోపాలపట్నం క్రైం పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 2న సామర్లకోటకు చెందిన గండిపిల్లి శ్రీరాములు కటుంబ సభ్యులతో సింహాచలం వరాహలక్ష్మి నృసింహ స్వామిని దర్శించుకోవడానికి వచ్చారు. సింహాచలంలో శ్రీరాములు మేనకోడలైన వేదాక్షి మెడలో ఉన్న 12 గ్రాముల చైన్ గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోవడంతో చుట్టు పక్కల వెతికారు. సామర్ల కోట వెళ్లి ఇంట్లో కూడా వెతికి చూసుకున్నారు. అక్కడా లేకపోవంతో గోపాలపట్నం క్రైం పోలీసులకు ఈ నెల 9న ఫిర్యాదు చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ సీఐ బీవీజే రాజు పర్యవేక్షణలో మేరకు ఎస్‌ఐ కేవీ సురేష్ దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ పుటేజీలు పరిశీలించి వాటి ఆధారాలతో మహిళను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమెను విచారించగా చైన్‌ను దొంగిలించినట్లు అంగీకరించడంతో ఆమె నుంచి గొలుసు రికవరీ చేసి ఆమెను రిమాండ్‌కు తరలించారు.

మానవ హక్కుల ఉల్లంఘన బాధాకరం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

దాబాగార్డెన్స్: ఇప్పటికీ మానవ హక్కుల ఉల్లంఘన అనేక చోట్ల జరుగుతూనే ఉందని దామోదర సంజీవయ్య మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై. సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. మానవ హక్కుల సమితి రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ నేతృత్వంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులు కల్పించిందన్నారు. అయితే ఆ హక్కులు దుర్వినియోగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ తాము నిరంతరం మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. తమ హక్కులకు భంగం కలిగితే ఎవరైనా తమను సంప్రదిస్తే వారికి న్యాయం జరిగే వరకూ అండగా నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు. కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరావు మాట్లాడుతూ మానవ హక్కుల విషయంలో రాజీ పడకుండా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బోర్డు ఆఫ్ స్టడీస్ ఆఫ్ లా చైర్మన్, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం, మానవ హక్కుల ప్రతినిధులు ఎస్‌వీ రమణ, సోమసుందరరావు, బి. మల్లేశ్వరరావు, నక్కాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఐక్య క్రిస్మస్ వేడుక


క్రిస్మస్ వేడుకల్లో శ్రీధర్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం: మానవత్వాన్ని చాటే ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని వైఎస్సార్‌సీపీ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, సెయింట్ పీటర్స్ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ అన్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జ్యోతి నిలయంలో మాన్యువల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధుల ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారిని అసోసియేషన్ అధ్యక్షుడు సబ్బవరపు మాణిక్యాలరావు నేతృత్వంలో సత్కరించారు. కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ పలువురు వృద్ధులను సన్మానించారు. తన సొంత నిధులతో సుమారు 800 మందికి భోజనాలు, వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎక్స్ అఫీషియో సభ్యులు ఇరోతి మరియదాస్, రాజాన శ్రీను, శ్యామ్‌సుందర్, కమల్, అన్నపూర్ణ, దేవి, మాన్యువల్ వెల్ఫేర్ సభ్యులు, పీపీసీ సభ్యులు పాల్గొన్నారు.